క్లుప్తంగా

శ్రమకు తగిన వేతనం చెల్లించాలి

బూర్గంపాడు: మండుటెండల్లో మట్టి పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలకు శ్రమకు తగిన వేతనం చెల్లించాలని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శ్రీరాంపురం అటవీప్రాంతంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను శనివారం ఆయన కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చేందుకు పనిప్రాంతాలలో కఠిన నిబంధనలు అమలు చేస్తుందన్నారు. కూలీలు పనిప్రాంతంలో రోజుకు మూడు ఫోటోలు తీసే నిబంధనతో కూలీలు ఉపాధి పనికి రావటం లేదన్నారు. అదేవిధంగా కొలతల ఆధారంగా వేతనం చెల్లించటంతో రోజుకు కనీసం రూ.150ల కూలి కూడా గిట్టడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

నేడు వైద్య శిబిరం

అశ్వాపురం: మండల కేంద్రంలో అశ్వాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు పొంగులేటి స్వరాజ్యం–రాఘవరెడ్డి చారిటబల్ ట్రస్ట్ (పీఎస్ఆర్) ఆధ్వర్యంలో భద్రాచలం కిమ్స్ ఆస్పత్రి వారి సౌజన్యంతో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య బృందం పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు కంటి వైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డులో ఉన్న పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 11న ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వరంగల్ శరత్ మాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

ఎంపీ టికెట్ కేటాయింపుపై హర్షం

భద్రాచలంటౌన్: కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోరిక బలరామ్ నాయక్‌ను ప్రకటించడంపై శనివారం భద్రాచలం డివిజన్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బాణాసంచా కాల్చారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పేద ప్రజలకు అభివృద్ధికి పాటుపడే వ్యక్తి, గతంలో కేంద్ర మంత్రిగా అనుభవం ఉన్న నాయకుడు బలరామ్ నాయక్ గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని నాయకులు తెలిపారు. మండల అధ్యక్షుడు సరేళ్ళ నరేష్, బుడగం శ్రీనివాస్, చింతరేల రవికుమార్, భోగాల శ్రీనివాసరెడ్డి, నాగ సతీష్, తిరుమలయ్య, వెంకటేష్, సుధీర్, ప్రదీప్ పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

అశ్వాపురం: ఈ నెల 12న హైదరాబాద్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొని ప్రసంగించే విజయసంకల్ప సమ్మేళన మహాసభకు పోలింగ్ బూత్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరై జయప్రదం చేయాలని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిర్రా సరస్వతి కోరారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో శనివారం జరిగిన బీజేపీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులను కలిసి మరోసారి మోడీ సర్కార్ అనే నినాదంతో ప్రచారం చేయాలన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కల్లూరి రామారావు, నాయకులు సురకంటి లింగారెడ్డి, బండ్ల నాగేశ్వరరావు, కొల్లు లింగారెడ్డి, కోలా భాస్కర్, కృష్ణకుమారి, గోసుల రాములు, కృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద సభను..

అశ్వాపురం: ఈ నెల 11న మణుగూరులో జరిగే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం సందర్భంగా ఈ నెల 11న మణుగూరుకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని మండలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు మధ్యాహ్నం 3 గంటల వరకు పెద్ద సంఖ్యలో సభా స్థలానికి చేరుకుని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా, మండల కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కే.ఖదీర్, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘చెత్త’ నిర్వహణతో అవస్థలు

- ప్రధాన రహదారుల పక్కనే చెత్తకు నిప్పు
- వెదజల్లుతున్న దుర్వాసన, పొగ
- పంచాయతీ వర్గాల నిర్వాకం


ఆర్ కొత్తగూడెంలో రోడ్డు పక్కనే వేసిన చెత్త..


దేవరపల్లిలో రోడ్డుకు దగ్గరలో కాలుస్తున్న చెత్త

చర్ల: ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్న లక్ష్యం నీరుగారుతోంది. వర్మీ కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఆరుబయట, ప్రధాన రహదార్ల పక్కన పోసి నిప్పు పెడుతుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త దగ్ధమవుతున్నప్పుడు వస్తున్న పొగతో ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి హానీ కలిగిస్తున్నారు.

నీరుగారుతున్న వర్మీ కంపోస్ట్ లక్ష్యం..

పల్లెలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీల ఆదాయాన్ని పెంచాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు షెడ్లు మండల వ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు మండలంలోనీ అన్నీ గ్రామ పంచాయతీలలో వీటి నిర్మాణాలను చేపట్టగా.. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ 2,50 లక్షల మేర వెచ్చించారు. అయితే ఎరువుల తయారీకి సంబంధించి ఇటు వ్యవసాయశాఖ అధికారులతో పాటు అటు పంచాయితీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అవి నిరాధరణకు గురవుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

ఒకే చోట అన్ని రకాల వ్యర్థాలు..

వర్మీ కంపోస్టు షెడ్లలో చెత్తను వేరు చేయడం, ఎరువులు తయారు చేయడం వంటి పనులు చేపట్టకపోతుండడంతో పంచాయతీల్లో సేకరించిన తడి, పొడి చెత్తతో పాటు ప్లాస్టిక్ వస్తువులు, తదితర వ్యర్థాలను అన్నింటినీ గ్రామ శివారు ప్రాంతాల్లో పోసి తగులబెడుతున్నారు. ప్లాస్టిక్, గాజు, ఐరన్ తదితర వ్యవర్థాలను వేరు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరడంతో పాటు ఇతర వ్యర్థాల వల్ల వర్మీకంపోస్టు ఎరువులను తయారు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. కానీ అలా చేయకపోవడం వల్ల పంచాయతీ ఆదాయాన్ని కోల్పోతోంది.

పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు..

చెత్తను సరైన రీతిలో వేరు చేయకపోవడం వల్ల ఆదాయాన్ని కోల్పోవడమే కాకుండా ఇలా ఆరుబయట, ప్రధానరహదారుల పక్కనే పడేసి కాల్చడం వల్ల దుర్వాసన, పొగను వెదజల్లుతున్నారు. తద్వారా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యి అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా ఆయా మార్గాల వెంట ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ పలు చోట్ల వీటిని వినియోగించకపోవడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

చర్యలు తీసుకోవాలి



చెత్తను రోడ్ల పక్కన వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. ఇలా చెత్త వేయడం వల్ల అది కుళ్లి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. దీంతో ఆయా మార్గాల గుండా వెళ్లాలంటే ఇత్ర ఇబ్బందికరంగా ఉంటోంది.

– ఎం.ఆనంద్‌కుమార్, చర్ల

డంపింగ్ షెడ్లను వినియోగించాలి



లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ షెడ్లు, వర్మీ కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. షెడ్లు నిర్మించినప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

– ఎస్.కోటేశ్వరరావు, చర్ల

రూ. 45 లక్షలతో డ్రెయినేజీ పనులు

బూర్గంపాడు: లక్ష్మీపురం గ్రామంలో రూ.45లక్షల ఎంపీ లాడ్ నిధులతో సిమెంట్ కాంక్రీట్ డ్రెయినేజీలను నిర్మించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత తెలిపారు. శనివారం సీసీ డ్రెయిన్ చేపట్టనున్న ప్రాంతాలను ఆమె పరిశీలించారు. సీసీ డ్రైన్ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేసేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, వార్డుసభ్యులు పాలం దివాకర్‌రెడ్డి, బొల్లా దర్గయ్య, ఏసుబు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.


సీసీ డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ శ్రీలత తదితరులు

సర్వేను ఉద్యమంలా చేయండి


కుష్టువ్యాధి సర్వేపై ఆశావర్కర్లకు అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ వెంకటేశ్వరరావు

చంద్రుగొండ: కుష్టువ్యాధిపై సర్వేను ఉద్యమంలా చేయాలని డీపీఎంఓ వెంకటేశ్వరరావు ఆశవర్కర్లకు సూచించారు. మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం ఆశవర్కర్లకు కుష్టువ్యాధిపై సర్వే విధానంపై అవగాహన కల్పించారు. ఈ నెల 11 నుంచి 24 వరకు మండలంలోని ప్రతిగ్రామంలోనూ ఇంటింటికి వెళ్లి సర్వే చేయాల్సి ఉంటుందన్నారు.

కుష్టువ్యాధి లక్షణాలు, వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో ఎదురయ్యే పరిణామాలపై ఆయన వివరించారు. సర్వేలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. డాక్టర్ హెచ్.వెంకట్‌ప్రకాష్, డాక్టర్ కనకం తనుజ, వైద్యసిబ్బంది ఇమాం, చంద్రకళ, లక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారేకు వినతి

చంద్రుగొండ: మండలంలో ముస్లింల సమస్యలపై ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ప్రభుత్వ ఖాజీ యండి.షబ్బీర్‌హుసేన్ వినతిపత్రం అందించారు. దమ్మపేటలో శనివారం ఎమ్మెల్యేను కలిసిన ఆయన.. ఖబరస్తాన్‌కు ప్రహరీ నిర్మాణం, షాదీఖాన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని షబ్బీర్‌హుసేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ అనుబంధ మైనార్టీ నాయకులు ఫజల్‌బక్ష్, యండి.అన్వర్, ఎస్‌కె.నాగుల్‌మీరా, యాకుబ్, అల్తాఫ్, అశ్రఫ్, కమల్‌షా పాల్గొన్నారు.

తెల్లం వెంకట్రావుకు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని మాల మహానాడు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్ రాజ్ మాట్లాడుతూ.. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో ఇళ్లులేని నిరుపేదల విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అటువంటి వారికి ఇళ్లు మంజూరయ్యే విధంగా చూడాలని ఆయన కోరారు. నాగమణి, భవాని, అనూష, జయమ్మ, మేరీ, పుల్లమ్మ, శేషమ్మ, అరుణ, సుజాత, రేవతి, లావణ్య పాల్గొన్నారు.


చంద్రుగొండ: సమస్యలపై ఎమ్మెల్యే జారేకు వినతిపత్రం అందిస్తున్న షబ్బీర్‌హుసేన్

రాయల సుభాష్ వర్ధంతి


దుమ్ముగూడెం: నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నార్లగూడెంలో గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 8 వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సాయన్న మాట్లాడుతూ.. రాయల సుభాష్ చంద్రబోస్ భూమి, భుక్తి, విముక్తి అందించలేని ప్రభుత్వాల మీద తిరుగుబాటు జెండా ఎగరవేశాడని, 48 సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపి పీడిత ప్రజల కోసం పోరాటం చేశాడని అన్నారు. ప్రజల కోసమే బతికాడు ప్రజల కోసమే మరణించాడు అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రాంచిట్టి, కన్నయ్య, రమేష్, లక్ష్మి, రాజేష్, రోజా, రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: విప్లవ యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) ఆశయాలను సాధించాలని, ఆయన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు కంగాల కల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని కావడిగుండ్ల గ్రామంలో రవన్న 8వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. రవన్న జీవితాంతం పేద, బలహీన వర్గాల గురించే ఆలోచించేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాడిస లక్ష్మణ్‌రావు, వాసం బుచ్చిరాజు, మడవి నాగేశ్వరావు, కణితి వెంకటేష్, మడకం దుర్గారావు, సాయిబాబు, కంగాల వెంకటేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి పథకం వర్తింపజేయాలి

బూర్గంపాడు: అర్హులైన పేదలందరికి ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–2 డంపర్ మెయింటెనెన్స్ సెక్షన్‌లో ఈపీ ఫిట్టర్‌గా పని చేసి విశ్రాంత జీవనం గడుపుతున్న కంది రాయమల్లు గత కొంతకాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఏరియా విశ్రాంత ఉద్యోగులు విరాళాలు సేకరించుకుని, రూ.77,032లను బాధితుడు రాయమల్లు కుటుంబ సభ్యులకు అందించారు. సహాయం అందించినవారికి విశ్రాంత ఉద్యోగులు శివరావు, కురి రాజేశ్వరరావు, గణేష్‌రెడ్డి, ఆర్.విచారి, వేణుగోపాల్, వి.జగదీష్, వెంకటేశ్వర్లులు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతులపై హర్షం

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో తాటిచర్ల కొత్త గనికి, ఓసీ గనుల్లో ఏడు లక్షల టన్నుల అదనపు బొగ్గు ఉత్పత్తి కోసం పర్యావరణ అనుమతులు మంజూరు కావడం పట్ల కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంఓఏఐ) సింగరేణి విభాగం అధ్యక్షుడు, పీకేఓసీ పీఓ తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ శనివారం హర్షం వ్యక్తం చేశారు. అనుమతుల మంజూరుకు కృషి చేసి సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే పూజలు

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో ఉన్న అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దర్శించుకున్నారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పానకాల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, పగడాల రాంబాబు, చిట్టిబాబు, మల్లేశ్వరరావు, చిన్నబాబు, పెదబాబు తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీలకే టికెట్ కేటాయించాలి

దుమ్ముగూడెం: మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీ అభ్యర్థికే కేటాయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సీతానగరం గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలు మహబూబాబాద్ ఎంపీ టికెట్ విషయంలో లంబాడి వర్గానికి సంబంధించిన అభ్యర్థులకే పెద్దపీట వేయడం ఆదివాసీ సమాజం జీర్ణించుకోలేనిదని అన్నారు. కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు సొంది మల్లుదొర ఆదివాసీ యూత్ లీడర్ తెల్లం హరికృష్ణ, డివిజన్ కార్యదర్శి కోరం మురళి, కారం నవీన్, వాగే అల్లేష్, వాగే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి


సింగరేణి సేవా భవన్‌ను ప్రారంభిస్తున్న ఏరియా జీఎం రామచందర్

మణుగూరురూరల్: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. శనివారం పీవీకాలనీలో రూ.11లక్షల వ్యయంతో సింగరేణి యాజ మాన్యం నిర్మించిన సింగరేణి సేవా భవన్‌ను ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం రామచందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి సింగరేణి సంస్థ ఖర్చుకు వెనుకాడకుండా ఉచితంగా వృత్తి విద్యా కోర్సుల శిక్షణను అందిస్తోందన్నారు. సింగరేణి యాజమాన్యం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక పరిపుష్టిని సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జీఎం రామచందర్‌ను మహిళలు శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే సింగరేణి ఏరియా ఆస్పత్రిలోని నూతన మెడికల్ స్టోర్స్ అదనపు గదుల ప్రాంగణాన్ని జీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం వీసం కృష్ణయ్య, ఏజీఎం (సివిల్) వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్) రమేష్, కార్మిక సంఘాల నాయకులు వై.రాంగోపాల్, కృష్ణంరాజు, సీనియర్ పీఓ శ్రీనివాస్, డీవైఎస్ఈ సివిల్ వై.రాజేంద్రప్రసాద్, సేవా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ రాణించాలి

ములకలపల్లి: మహిళాశక్తి అపారమని, వారు అన్ని రంగాల్లోనూ రాణించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీటీసీలు తాటి తులసి, సున్నం సునితతోపాటు పలురంగాలకు చెందిన మహిళలను ఘనంగా సన్మానించారు. దుశ్శాలువలతో సత్కరించారు. షేక్ ఖాదర్‌బాబా, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, సురభి రాజేష్, తాటి భద్రం తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ..

అశ్వారావుపేట: అశ్వారావుపేట మేజర్‌పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులకు స్థానికురాలు, సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ దారా ప్రమీల చీరలను పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామపంచాయతీలో విశిష్ట సేవలందిస్తున్న మహిళలకు కాటన్ చీరలను పంపిణీ చేశారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఈఓ హరికృష్ణ, జి.డూండీ రాంప్రసాద్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్నెస్ రన్..

దుమ్ముగూడెం: మండల పరిధిలోని బి. కొత్తగూడెం గ్రామ పంచాయతీలో నెహ్రూ యువ కేంద్రం ఖమ్మం వారి సహకారంతో ఎఫికర్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవన్ని పురస్కరించుకుని నారి శక్తి ఫిట్నెస్ రన్ కార్యక్రమన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ సర్పంచ్ కాటిబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం మహిళలకు పరుగు పందేలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎఫికర్ సంస్థ ధర్మరాజు, మల్లయ్య, కాశేశ్వరావు, సావిత్రి, కిరణ్ బాబు, జాన్బాబు, వెంకటేష్, జి.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


బూర్గంపాడు: నాగినేనిప్రోలు శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం


చర్ల: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చర్ల: శివపార్వతుల కల్యాణోత్సవాలు మండలంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు తేగడలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి దేవాలయం, కలివేరులోని శ్రీ స్వయంభూ శివాలయం, లింగాలలోని శివాలయాల్లో కల్యాణ మహోత్సవాలను వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

బూర్గంపాడు: శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తజనంతో పోటెత్తాయి. శుక్రవారం అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా సాగింది. గోదావరి మధ్యలోని మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం వేలాదిమంది భక్తుల నడుమ కన్నుల పండువగా జరిగింది. భక్తజన సందోహంతో గోదావరి తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, బూర్గంపాడు,మోరంపల్లిబంజర, సారపాకలోని శివాలయాల్లో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది.

కళాకారుల సందడి..

అన్నపురెడ్డిపల్లి: స్థానిక భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాల్లో ఓ టీవీషో కళాకారులు అలరించారు. ఉత్సవాల్లో కెవ్వు కార్తీక్ బృందం వినోదిని, రాజమౌళి, పటాస్ ప్రవీణ్, కళాసాగర్‌లు పలు వినోద కార్యక్రమాలతోపాటు కామిడి షో నిర్వహించారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు, ప్రేక్షకులు అధిక సంఖ్యలో తరలిరాగా ఉత్సవాల్లో సందడి నెలకొంది. ముందుగా కళాకారుల బృందం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలి

చర్ల: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు ఏజెన్సీల ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి మధుసూధనరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం చర్లలోని మార్కెట్ కాంప్లెక్స్ సముదాయంలో జరిగిన మిషన్ భగీరథ పథకం కార్మికుల డివిజన్ జనరల్ బాడీ (ఐఎఫ్‌టీయూ) సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మధుసూధనరెడ్డి మాట్లాడారు. ఈ కార్మికులను రెగ్యులర్ చేసి, ప్రతీ నెల 1వ తేదీన కార్మికుల బ్యాంకు ఖాతాలోకి ప్రభుత్వమే జీతాలు వేయాలని కోరారు. ఈ నెల 11న భద్రాచలంకు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి రామయ్య సాక్షిగా మిషన్ భగీరథ కార్మికుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన మామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి కొండా చరణ్, నాయకులు మేడి సుందర్‌రావు, మద్ది లక్ష్మీనర్సింహారెడ్డి, ములకా నరేష్, పవన్, ఎల్ శ్రావణ్, రావుల కిశోర్, నీల వాసు, వినయ్, రాజేష్, నవీన్, వినోద్, సాయి, రాజేష్, కృష్ణ, కిరణ్, సుబ్బు, దీక్షిత్ పాల్గొన్నారు.

ఈ పాఠశాలలపై వివక్ష ఎందుకు?


కుదునూరులో ఆర్అండ్‌బీ రహదారి పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల

చర్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సమీపంలోని ప్రధాన రహదార్లపై స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేసిన ఆర్అండ్‌బీ అధికారులు కుదునూరులో ఉన్న రెండు ప్రభుత్వ పాఠశాలల వద్ద ఏర్పాటు చేయకపోవడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా వాహనాలు నెమ్మదిగా వెళ్లేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రధాన ఆర్అండ్‌బీ రహదార్లపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. కానీ కుదునూరులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న రహదార్లపై ప్రమాద సూచికలను, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేయలేదు.

ఈ విషయంపై ఆయా పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్అండ్‌బీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 65 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా ఈ రెండు పాఠశాలలు కూడా ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్నాయి. తక్షణమే ఈ రెండు పాఠశాలల సమీపాల్లోని ప్రధాన రహదారిపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.